సంపుటి :02 సంచిక :134 పేజీలు :04
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
బుధవారం 17, జూలై 2025

## 357 మంది మావోయిస్టులు మృతి

గడ్డు పరిస్థితులపై మావోయిస్టు పార్టీ రివ్యూ

02

వెలుగులోకి పార్టీ సెంట్రల్ కమిటీ డాక్యుమెంట్

## పథకం ప్రకారమే హత్య



- బుగులోని గుట్ట కేసులో ఆరుగురి అరెస్ట్
- చనిపోయిన వారిలో పార్టీ సానుభూతిప రుడి నుంచి జనరల్ సెక్రటరీ వరకు
- డాక్యుమెంట్లో గతేడాది పార్టీ పరమైన నష్టాలపై వివరణ

04

# కాళేశ్వరం.. కాసుల పంట

- ఇప్పటికే నూనె శ్రీధర్, హరిరాం అక్రమాస్తులు తేల్చిన ఏసీబీ
- తాజాగా మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు ఇళ్లు, బంధువుల ఇళ్లలో సోదాలు
- ఏకంగా రూ.500 కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ లో పనిచేసిన ఒక్కో అధికారి అవితీని లీలలే వేరు!

కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసిన ఇరిగేషన్‌శాఖ ఉన్నత అధికారులు ప్రాజెక్ట్‌ను బంగారు బాతు అనుకున్నారు. వేలాది కోట్ల అంచనాతో మొదలైన ఈ ప్రాజెక్ట్ నుంచి అధికారులు అందినంత దోచుకున్నారు. ఎక్కడ వీలైతే అక్కడ డబ్బులు దండుకున్నారు. హైక్లాస్ విల్లాలు, ఖరీదైన అపార్ట్‌మెంట్లు, లగ్జరీ కార్లు, కొన్ని వందల ఎకరాల్లో ఫాం హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఒక మామూలు ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన వారు.. ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. కాళేశ్వరం నుంచి కాసుల పంట పండించుకున్నారు. ఆదాయానికి మించిన అక్ర మాస్తుల విషయంలో ఏసీబీ దాడులు చేయడంతో వారి బాగోతం బయపడు తోంది. ఏసీబీ ఇప్పటికే గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసిన నూనె శ్రీధర్, హరిరాంకు చెందిన అక్రమాస్తులను గుర్తించగా, తాజాగా మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు అక్రమాస్తుల నిగ్గు తేల్చింది. ఆయనకు సంబంధించి సుమారు రూ.500 కోట్ల విలువైన అక్రమాస్తులను ప్రాథమికంగా గుర్తించింది.

03

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

అక్రమాస్తులు కూడబెట్టి కోట్లకు పడగలెత్తిన 'ఇరిగేషన్ సార్లు'







## జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు


- జడ్పీపీలు 31, జెడ్పీటీసీలు 566, ఎంపీటీసీలు 5,773
- స్థానిక ఎన్నికలకు వడివడిగా అడుగులు

03

స్థానిక ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కోర్టు ఆదేశాలతో ఇటు ప్రభుత్వం అటు ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు కనపడుతుంది. ఇప్పటికే.. ఎన్నికల సంఘం కలెక్టర్లకు అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని లేఖ రాయగా.. తాజాగా.. ప్రభుత్వం బుధవారం రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీల స్థానాలను ఖరారు చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం.. జడ్పీపీలు – 31, జడ్పీటీసీలు – 566, ఎంపీపీలు – 566, ఎంపీటీసీ స్థానాలు – 5773 గా ఉన్నాయి. ఈ మేరకు జిల్లా వారీగా జడ్పీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎంపీటీసీ స్థానాలు అత్యధికంగా నల్గొండ జిల్లాలో 353, అత్యల్పంగా ములుగు జిల్లాలో 83 ఉండటం గమనార్హం.

– అక్షరదర్బార్, హైదరాబాద్

## ఉత్కంఠ



- బీసీ రిజర్వేషన్లపై రాజభవన్‌కు ఆర్డినెన్స్
- సీఎం, క్యాబినెట్ మంత్రుల ఆమోదంతో గవర్నర్ చెంతకు ముసాయిదా
- పంచాయతీరాజ్ చట్టం -2018 సవరణకు విజ్ఞప్తి
- 'రిజర్వేషన్లు 50శాతం మించొద్దు' అనే పదం తొలగిస్తే చట్ట సవరణ
- సవరణ పూర్తికాగానే రిజర్వేషన్లపై బీసీ కమిషన్ సిఫార్సులు
- ఇక 'స్థానిక' ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లకు మార్గం సుగమం

02

## ఏడ చూసిన ఇసుక డంపులే..!

- గ్రామాల్లో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన ఇసుక డంపులు
- డంపులను సీజ్ చేయని అధికారులు
- ఇసుక పాలసీ తీసుకురావాలంటున్న స్థానిక ప్రజలు
- విలాసాగర్ వ్యవహారంపై ఉదాసీనత ప్రదర్శిస్తున్న అధికారులు

04



# పారదర్శకంగా న్యాయం అందించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
## కాజీపేట పోలీస్ స్టేషన్ తనిఖీ

అక్షరదర్బార్, కాజీపేట: పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కాజీపేట పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి పూలమొక్కను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ ను సీపీ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డీసీలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నమ్మకాన్ని కలిగించడంతో పాటు పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో



విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్ఐలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్, శివ పాల్గొన్నారు.

**ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శన**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించడంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పార్కింగ్ ఏర్పాట్లు, సిబ్బంది పనితీరుపై ఆయన ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు.




# ఉత్కంఠ

- బీసీ రిజర్వేషన్లపై రాజభవన్‌కు ఆర్డినెన్స్
- సీఎం, క్యాబినెట్ మంత్రుల ఆమోదంతో గవర్నర్ చెంతకు ముసాయిదా
- పంచాయతీరాజ్ చట్టం -2018 సవరణకు విజ్ఞప్తి
- 'రిజర్వేషన్లు 50శాతం మించొద్దు' అనే పదం తొలగిస్తే చట్ట సవరణ
- సవరణ పూర్తికాగానే రిజర్వేషన్లపై బీసీ కమిషన్ సిఫార్సులు
- ఇక 'స్థానిక' ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లకు మార్గం సుగమం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :** వెనుక బడిన (బీసీ) వర్గాల రిజర్వేషన్ల విషయంలో తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం రూపొందించిన ముసాయిదా గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టం 2018లో సవరణల ఆమోదం కోసం సర్కార్ ఆ ఆర్డినెన్స్‌ను మంగళవారం పంపింది. చట్టంలోని సెక్షన్ 285 క్లాజ్ (ఎ)లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని రాసి ఉన్న దానిని తొలగిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం ఉద్దేశం. పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు ఇచ్చిన గడువు సమీపిస్తున్నందున.. సర్కార్ ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ చేసేందుకు కసరత్తు చేస్తున్నది. పంచాయతీరాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రుల ఆమోదంతో రాజ్‌భవన్‌కు ముసాయిదాగా పంపించింది.

### - గవర్నర్ ఆమోదం పొందితే చట్టసవరణ..

గవర్నర్ ఆమోదం పొందితే ఇక చట్టసవరణ అమలులోకి రానుంది. అందుకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్స్ చేయనున్నది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టుకు గడువు విధించిన విషయం




తెలిసిందే. హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతుండటంతో వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత, డెడికేటెడ్ కమిషన్ తుది నివేదిక ఇచ్చిన తర్వాత ఈనెల చివరిలోపు జీవో విడుదలయ్యే అవకాశం కనిపిస్తున్నది.

### - డెడికేటెడ్ కమిషన్ కీలక పాత్ర

నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా డెడికేటెడ్ కమిషన్ ఇప్పటికే నివేదిక ఇచ్చినప్పటికీ, చట్టానికి కొత్త సవరణల ప్రకారం గణాంకాలతో మరో నివేదిక ఇవ్వమని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నివేదిక వచ్చిన వెంటనే వారం రోజుల్లోపు జీవో విడుదలయ్యే అవకాశం ఉంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు విషయంలో కొన్ని రాష్ట్రాలు న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొన్నాయి. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల ప్రక్రియను అత్యంత సున్నితంగా ముందుకు తీసుకెళ్లాలని సర్కార్ భావిస్తున్నది. ముందు న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నది. చట్ట సవరణను ఇక కోర్టులు కూడా తప్పుపట్టేందుకు వీలు లేకుండా జాగ్రత్త వహిస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని బీసీ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక బీసీలకు పెద్ద ఎత్తున కొత్త సీట్లు దక్కుతాయని భావిస్తున్నారు.

# కళాశాల బిల్డింగ్ మంజూరు చేయాలి

- పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి




అక్షరదర్బార్, వెంకటాపురం(నూగూరు) : మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులకు నూతన బిల్డింగ్, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వెంకటాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో కళాశాల నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మేడ వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, రాష్ట్ర వ్యాప్తంగా గత 5, 6 సంవత్సరాల నుంచి పెండింగులో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్మెంట్ రూ.8,500 కోట్ల దాకా అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువులు ఆగిపోతున్నాయని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నారని, వెంకటాపురం మండల కేంద్రంలోని కళాశాలలో 250 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా బిల్డింగ్స్ సౌకర్యం లేక పోవడంతో వారి చదువులు మార్గమధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులు నూతన బిల్డింగ్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, బాత్రూంలు, ఫర్నిచర్ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోడి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కొరస వంశీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 357 మంది మావోయిస్టులు మృతి

## గడ్డు పరిస్థితులపై మావోయిస్టు పార్టీ రివ్యూ

- వెలుగులోకి పార్టీ సెంట్రల్ కమిటీ డాక్యుమెంట్
- చనిపోయిన వారిలో పార్టీ సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ వరకు
- డాక్యుమెంట్లో గతేడాది పార్టీ పరమైన నష్టాలపై వివరణ
- యుద్ధతంత్రంలో కొత్త పంథా అనుసరించేందుకు ప్రణాళికలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :** గడిచిన ఏడాది కాలంలో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడి నుంచి పార్టీ సుప్రీం కమాండర్, జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు వరకు మొత్తం 357 మంది మావోయిస్టులు నేలకొరిగారని పార్టీ మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) డాక్యుమెంట్ చెబుతోంది. జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్ లో ఈ వివరాలు బయటకు వచ్చాయి. డాక్యుమెంట్లో పార్టీ ఎన్నో చీకటి కోణాలను ఆవిష్కరిస్తున్నామని ప్రకటించింది. రాజ్యం చేపట్టిన బూటకపు ఎన్ కౌంటర్ల వల్ల 80 మంది మావోయిస్టులు చనిపోయారని ఆరోపించింది. మృతిచెందిన 357 మందిలో 136 మంది మహిళలేనని స్పష్టం చేసింది. ఎదురుకాల్పులు కాకుండా అనారోగ్య కారణాలతో మరో నలుగురు, రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతిచెందారని పేర్కొంది. అలాగే చనిపోయిన మొత్తం సభ్యుల్లో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు,16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 23 మంది జిల్లా కమిటీ సభ్యులు, 83 మంది ఏరియా కమిటీ, 138 మంది పార్టీ సభ్యులు, పీఎల్ జీఏ 17, ఇతర విభాగాల వారు 40, గుర్తించని మృతులు 36 మంది ఉన్నారని తేల్చిచెప్పింది. వీరందరి త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది.



### జవాన్ల వైపూ నష్టం..

నక్సల్బరీ విప్లవ పోరాటం మొదలైన తర్వాత ఆపరేషన్ కగార్ తో ఏడాది వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో సెంట్రల్, స్టేట్ కమిటీ సభ్యులను కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పార్టీ సెంట్రల్ కమిటీ పేర్కొంది. గతేడాది ఏప్రిల్ లో జరిగిన కాంకేర్ ఎన్ కౌంటర్ లో 29 మంది మావోయిస్టులు చనిపోయారని, తర్వాత సగటున ప్రతి 20 రోజులకు ఒక భారీ ఎన్ కౌంటర్ జరుగుతోందని వాపోయింది. ఒక్కో ఎన్కౌంటర్లో సగటున 10_35 మంది వరకు మావోయిస్టులు చనిపోయారని తెలిపింది. 20 కిలో మీటర్ల వలయాకారంలో వేలాది మంది భద్రతా బలగాలు చుట్టుముడుతూ తమపై దాడులు చేస్తున్నాయని, ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ గల భద్రతా దళాలను తమ కేడర్ ప్రాణాలకు తెగించి ఎదుర్కొంటున్నదని చెప్పింది. ప్రతి ఎన్కౌంటర్లోనూ భద్రతాదళాల వైపు కూడా నష్టం జరుగుతున్నదని, తమ అంచనా ప్రకారం గడిచిన ఏడాదిలో 70 మంది జవాన్లు మృతిచెందారని, 130 మంది తీవ్రంగా గాయపడి ఉంటారని అభిప్రాయపడింది.


### జవాన్ల మృతుల లెక్కలు తప్పు..

ఎన్కౌంటర్లలో మృతిచెందిన జవాన్ల సంఖ్య కూడా పెద్దగానే ఉంటుందని, కానీ.. ప్రభుత్వాలు జవాన్ల మృతుల సంఖ్యను తక్కువగా చేసి చూపుతోందని పార్టీ అభిప్రాయపడుతున్నది. మావోయిస్టు పార్టీ దీర్ఘకాలిక సాయుధ పోరాటంలో ఎత్తుపల్లాలు సహజమేనని పార్టీ పేర్కొన్నది. అలాగే పార్టీ డాక్యుమెంట్ లో కేంద్ర కమిటీ తాజా పరిణామాల పైనా తన అభిప్రాయాలను తెలిపింది. గెరిల్లా యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలను సరైన రీతిలో అమలు చేయనందుకే పార్టీకి నష్టాలు పెరిగాయని వివరణ ఇచ్చింది. 2024 ఆగస్టులో పొలిట్ బ్యూరో తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకురాలేకపోతున్నట్లు పేర్కొంది. వర్గ పోరాటాన్ని వికేంద్రీకరించి అటవీ, గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని స్పష్టంగా పేర్కొంది. మరోవైపు మావోయిస్టులతో ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలంటూ 9 రాష్ట్రాల నుంచి డిమాండ్ రావడం ఇటీవల కాలంలో కనిపించింది. ఆ పరిణామం తమకు ఎంతో సానుకూల పరిణామమని పార్టీ పేర్కొంది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్రం చేసిన ప్రకటన ఎప్పటికీ నెరవేరబోదని ధీమా వ్యక్తం చేసింది.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- జడ్పీపీలు 31, ఎంపీపీలు 566, ఎంపీటీసీలు 5,773
- స్థానిక ఎన్నికలకు వడివడిగా అడుగులు

అక్షరదర్బార్, హైదరాబాద్: స్థానిక ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కోర్టు ఆదేశాలతో ఇటు ప్రభుత్వం అటు ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు కనపడుతుంది. ఇప్పటికే.. ఎన్నికల సంఘం కలెక్టర్లకు అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని లేఖ రాయగా.. తాజాగా.. ప్రభుత్వం బుధవారం రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీల స్థానాలను ఖరారు చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం.. జడ్పీపీలు – 31, జడ్పీటీసీలు – 566, ఎంపీపీలు – 566, ఎంపీటీసీ స్థానాలు – 5773 గా ఉన్నాయి. ఈ మేరకు జిల్లా వారీగా జడ్పీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎంపీటీసీ స్థానాలు అత్యధికంగా నల్గొండ జిల్లాలో 353, అత్యల్పంగా ములుగు జిల్లాలో 83 ఉండటం గమనార్హం.




# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సుష్మకు వినతిపత్రం సమర్పించారు. వెల్లంపెల్లి రోడ్డులోని బస్టాండ్ వద్ద సంవత్సరాల తరబడి డబ్బా దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న 50కి పైగా కుటుంబాల కోసం గత ప్రభుత్వంలో హామీ ఇచ్చిన షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానం కల్పించాలని వారు కోరారు. పరకాల-అంబాల రోడ్డు ఫోర్ లైన్ విస్తరణ, బస్టాండ్ జంక్షన్ అభివృద్ధిని స్వాగతిస్తూనే, చిరు వ్యాపారుల విషయమై మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. చెత్త సేకరణ ఆటోలు సక్రమంగా పనిచేయడం లేదని, కోటి రూపాయలు పెట్టి కొన్న రోడ్ క్లీనింగ్ మిషన్ ఏమైందని ప్రశ్నించారు. పారిశుద్ధ్యానికి ప్రాముఖ్యత ఇచ్చి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ కొలను పాక భద్రయ్య, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం.. కాసుల పంట

- అక్రమాస్తులు కూడబెట్టి కోట్లకు పడగలెత్తిన 'ఇరిగేషన్ సార్లు'

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసిన ఇరిగేషన్‌శాఖ ఉన్నత అధికారులు ప్రాజెక్ట్‌ను బంగారు బాతు అనుకున్నారు. వేలాది కోట్ల అంచనాతో మొదలైన ఈ ప్రాజెక్ట్ నుంచి అధికారులు అందినంత దోచుకున్నారు. ఎక్కడ వీలైతే అక్కడ డబ్బులు దండుకున్నారు. హైక్లాస్ విల్లాలు, ఖరీదైన అపార్ట్‌మెంట్లు, లగ్జరీ కార్లు, కొన్ని వందల ఎకరాల్లో ఫాం హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఒక మామూలు ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన వారు.. ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. కాళేశ్వరం నుంచి కాసుల పంట పండించుకున్నారు. ఆదాయానికి మించిన అక్రమాస్తుల విషయంలో ఏసీబీ దాడులు చేయడంతో వారి బాగోతం బయపడుతోంది. ఏసీబీ ఇప్పటికే గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో పనిచేసిన నూనె శ్రీధర్, హరిరాంకు చెందిన అక్రమాస్తులను గుర్తించగా, తాజాగా మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు అక్రమాస్తుల నిగ్గు తేల్చింది. ఆయనకు సంబంధించి సుమారు రూ.500 కోట్ల విలువైన అక్రమాస్తులను ప్రాథమికంగా గుర్తించింది.

అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)కు నీటిపారుదల శాఖలో పెద్ద అవినీతి తిమింగలం చిక్కింది. ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మురళీధర్‌రావుకు సంబంధించి రూ.500 కోట్ల అక్రమాస్తులను ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ఈ కేసులోనే మంగళవారం ఉదయం ఏసీబీ మురళీధర్‌రావును అదుపులోకి తీసుకున్నది. తొలుత బంజారాహిల్స్‌లోని ఆయన ఇంటితో పాటు మరో 11 ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలో అధికారిగా పని చేసినప్పుడే ఆయన వందల కోట్లు అక్రమంగా కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. గతంలో ఆయన ప్రాజెక్టుల టెండర్లకు ఆమోదముద్ర వేసే కమిషనరేట్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రాజెక్టుల నిర్మాణ సామగ్రి ధరలను(ఎస్ఎస్ఆర్) నిర్ణయించే అధికారం కూడా సీవోటీ పరిధిలోనే ఉంటుంది. నిర్దేశించిన గడువు మేరకు పనులు పూర్తికాని టెండర్ల ప్యాకేజీల అగ్రిమెంట్లను పొడిగించడం, పనులు సకాలంలో పూర్తికాక ధరలు పెరిగిన పక్షంలో ఆ టెండర్ ప్యాకేజీని రివైజ్ చేసే అధికారం కూడా సీవోటీ కిందకే వస్తుంది. నీటిపారుదల సర్కిళ్ల నుంచి వచ్చే ప్రతిపాదనలను నిర్ధారించే స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన పదవీకాలంలో ప్రాజెక్టులకు సంబంధించి వేల ప్యాకేజీల రివైజ్డ్ ఎస్టిమేట్స్, ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టర్మ్స్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారు.

**- ఉద్యోగ విరమణ చేసినా మళ్లీ పదవి పొడిగింపు..**

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పాటు అనంతరం నీటిపారుదల శాఖ ఈఎన్సీగా మురళీధర్‌రావు బాధ్యతలు నిర్వహించారు. అనేక ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారు. కాళేశ్వరం నిర్మాణంలోనూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్యారేజీల నిర్మాణ స్థలాల మార్పుతోపాటు పలు అంశాలపై హైపవర్ కమిటీ(హెపీసీ)కి నేతృత్వం వహించారు. ప్రాజెక్టుల పునరాకృతితో చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి, సీతారామ, డిండి తదితర ప్రాజెక్టులతోపాటు అనేక ఎత్తిపోతల పథకాలను ఆయన హయాంలోనే నిర్మించారు. 2013లోనే ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఆయన సర్వీసును నాటి ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014 నుంచి ఈఎన్సీ(జనరల్)గా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక 2024 జనవరి వరకు కొనసాగారు. కృష్ణా జలాల అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలతో ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి వెలుగుచూసిన లోపాల విషయంలో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఎదుట విచారణకు మురళీధర్‌రావు హాజరయ్యారు.




## నూనె శ్రీధర్ అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైగా..

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన నీటిపారుదలశాఖ ఈఈ నూనె శ్రీధర్ అక్రమాస్తులు రూ.150 కోట్ల వరకు ఉంటుందని ఇటీవల ఏసీబీ అధికారులు సోదాలు చేసి ఒక అంచనాకు వచ్చారు. అలాగే లాకర్లలో రూ.5 కోట్ల విలువైన ఆస్తి పత్రాలు, ఆభరణాలు, కొంతవరకు బ్యాంకు లాకర్లలో గుర్తించారు. నిన్నమొన్నటివరకు వరకు చొప్పదండి ఇరిగేషన్ ఈఈగా పనిచేసిన నూనె శ్రీధర్ గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా పని చేశాడు. ఆ సమయంలో ఆయన అడ్డగోలుగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. శ్రీధర్ మొన్నటివరకు జైలులో రిమాండు ఖైదీగా ఉన్నారు. తర్వాత ఏసీబీ న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని విచారించింది.

- ఇప్పటికే నూనె శ్రీధర్, హరిరాం అక్రమాస్తులు తేల్చిన ఏసీబీ
- తాజాగా మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు ఇళ్లు, బంధువుల ఇళ్లలో సోదాలు
- ఏకంగా రూ.500 కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు
- కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పనిచేసిన ఒక్కో అధికారి అవితీని లీలలే వేరు!

**ప్రాథమికంగా గుర్తించిన అక్రమాస్తులు ఇలా..**

హైదరాబాద్‌తోపాటు శివార్లలో ఓపెన్ ప్లాట్లు, వాణిజ్య భవనాలు, వ్యవసాయ భూములున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని మోకిలలో 6,500 చదరపు గజాల నివాస స్థలమున్నట్లు బయటపడింది. అక్కడ బహిరంగ మార్కెట్‌లో చదరపు గజం సగటున రూ.లక్ష పలుకుతుండటం గమనార్హం. ఈ లెక్కన ఆ ఒక్క స్థలం విలువే సుమారు రూ.65 కోట్లు ఉంటుందని అంచనా. హైదరాబాద్‌లోని ఖరీదైన ప్రాంతాల్లో 4 ఓపెన్ ప్లాట్లు, కొండాపూర్‌లో విల్లా, కోకాపేట్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, బేగంపేటల్లో ఒక్కో ఫ్లాట్, హైదరాబాద్, కరీంనగర్‌లో ఒక్కో వాణిజ్య భవనం, కోదాడలో ఒక అపార్ట్‌మెంట్‌తోపాటు వరంగల్‌లో నిర్మాణ దశలో ఉన్న అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లో 2 కిలోవాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, హైదరాబాద్ శివార్లలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, మెర్సిడస్ బెంజ్ సహా మూడు కార్లు మురళీధర్‌రావుకు చెందినవిగా ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇవి కాక బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు కూడా గుర్తించారు. ఇవన్నీ కలిపి మురళీధర్‌రావుకు సంబంధించిన అక్రమాస్తులు సుమారు రూ.500 కోట్ల వరకు ఉండొచ్చని ఓ అంచనాకు వచ్చారు.

**- అక్రమాల పుట్ట.. హరిరామ్**

గజ్వేల్‌కు చెందిన మాజీ ఇంజినీర్ -ఇన్ -చీఫ్ (ఈఎన్సీ) హరిరామ్ గతంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో పెద్దస్థాయి పర్యవేక్షణ అధికారిగా పనిచేశాడు. ఆయన ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వస్తుండటంతో ఏసీబీ అధికారులు మూడు నెలల క్రితం ఏకకాలంలో 14 ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. ఆ ఒక్కరోజే ఏసీబీ ఆయన ఆస్తి పత్రాలు, స్థిర, చరాస్తులను ప్రాథమికంగా లెక్కేసి రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అంచనాకు వచ్చింది. హైదరాబాద్‌లోని షేక్‌పేట, కొండాపూర్‌లో రెండు లగ్జరీ విల్లాలు, శ్రీనగర్, నార్సింగి, మాదాపూర్‌లో మూడు ఫ్లాట్లు, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతమైన అమరావతిలో ఒక వాణిజ్య స్థలం, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇళ్లు, బొమ్మల రామారంలో ఆరు ఎకరాల ఫాంహౌస్, మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణ దశలో ఉన్న భవనం గుర్తించింది. ఇవి కాక మిర్యాలగూడలో ఖాళీ స్థలం, బీఎండబ్ల్యూ కారు, బంగారు ఆభరణాలు సహా రెండు కార్లు, బ్యాంకు డిపాజిట్లు ఇతర ఆస్తులు హరిరామ్‌కు చెందినవిగా ఏసీబీ గుర్తించింది. షేక్‌పేటలోని ఆదిత్య రాయల్ ఫాంలోని హరిరామ్ విల్లాలో మొదట ఏసీబీ తనిఖీలు నిర్వహించింది.

# మహానగరాన్ని ఒకే జిల్లాగా మార్చండి

- రెండు జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చండి
- మహానగర ప్రజా సంఘాల, మేధావుల విజ్ఞప్తి

అక్షరదర్బార్, హనుమకొండ: చారిత్రక నగరంగా ఉన్న వరంగల్ ను హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా విభజించి వరంగల్ మహానగరంతో పాటు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అభివృద్ధిని కుంగ దీసారని, రెండు జిల్లాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. రెండు జిల్లాల ప్రజా సంఘాలు, మేధావులు బుధవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వరంగల్ నగరం హైదరాబాద్ మహానగరంలాగా ఎదిగి అతిపెద్ద అభివృద్ధి కేంద్రంగా ఏర్పడి అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆశించారని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో వరంగల్ కేంద్రంగా ఉద్యమకారులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, యువత ఆశలు పెంచుకున్నారని, కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కల్వకుంట్ల పాలనలో వరంగల్ ను ఆరు జిల్లాలుగా ముక్కలు చేసి చారిత్రక నేపథ్యాన్ని, భౌగోళిక ఐక్యతను, అభివృద్ధి క్రమాన్ని, రాజకీయ చైతన్యాన్ని సాంస్కృతిక గంభీరత్వాన్ని ధ్వంసం చేశారని, ఆశాస్త్రీయ చర్యకు పాల్పడి వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా విభజించి ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు.

ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ సకల అభివృద్ధి రంగాలు సమ ఉజ్జిగా అభివృద్ధి జరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ ను కాలగర్భంలో కలిపారని, కాకతీయ యూనివర్సిటీ, ఎల్బీ కళాశాల, సీకేఎం లాంటి విద్యా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా వరంగల్ ప్రజలకు మిగిలింది ఏంటో ఈ ప్రాంత పాలకులు ఆలోచించాలని అన్నారు. వరంగల్ మహా నగరాన్ని ఒకే జిల్లాగా చేసి కోయంబత్తూర్, నాగపూర్, పూణే, విశాఖపట్నం లాగా హైదరాబాద్ నగరానికి సమాంతరంగా ఎదిగే విధంగా చేయకుంటే ఈ ప్రాంతం నిరుద్యోగులతో ఎడారిగా మారే ప్రమాదమున్నదని అన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి మాట్లాడుతూ 33 జిల్లాల అభివృద్ధి సూచిలో 25 నుండి 33 స్థానాల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులందరూ విభేదాలను విస్మరించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశలో సమిష్టిగా కృషి చేయాలని, హైదరాబాద్ జిల్లాలో 19 నియోజకవర్గాలు ఉన్నాయని, ఏ ఇతర జిల్లాను ఈ విధంగా విభజించలేదని, వరంగల్ కార్పొరేషన్ ను మహానగరంగా మార్చడం కోసం 40 గ్రామాలను విలీనం చేశారని, తర్వాత ఆ మహానగరాన్ని జిల్లాల పేరుతో ముక్కలు చేయడం సరికాదని అన్నారు. వరంగల్ మహానగరాన్ని ఒకే జిల్లా గొడుగు కిందకి తేవడానికి ప్రొఫెషనల్స్, ఇతర సంఘాలను అన్ని రాజకీయ పార్టీల సహకారం తీసుకొని ప్రజా ఉద్యమం చేయడానికి త్వరలోనే సమాయత్తం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ నాయకులు బొమ్మినేని బాపిరెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యామ్ యాదవ్, రిటైర్డ్ అధ్యాపకులు వీరమల్ల బాబురావు, జి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఏడ చూసిన ఇసుక డంపులే..!

- గ్రామాల్లో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన ఇసుక డంపులు
- డంపులను సీజ్ చేయని అధికారులు
- ఇసుక పాలసీ తీసుకురావాలంటున్న స్థానిక ప్రజలు
- విలాసాగర్ వ్యవహారంపై ఉదాసీనత ప్రదర్శిస్తున్న అధికారులు

**అక్షరదర్బార్, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు వాగు ఇసుక దందా వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. విలాసాగర్ గ్రామానికి చెందిన వ్యక్తులతో పాటు సమీప గ్రామాలకు చెందిన మరికొందరు వ్యక్తులు ఇసుక దందాకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. గత కొన్ని నెలల నుండీ మానేరు వాగులో స్థానిక, అభివృద్ధి అవసరాల పేరుతో ఇసుకని తోడి పక్కదారి పట్టించినట్లుగా ఆనవాళ్లు వెలుగులోకి వస్తున్నాయి. ట్రాక్టర్ల లో ఇసుకను తీసుకొచ్చి సమీప గ్రామాల్లో పెద్ద మొత్తంలో డంపులు ఏర్పాటుచేసినట్లుగా సమాచారం.ఇందులో ముఖ్యంగా విలాసాగర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో పాటు శంకరాంపల్లి, గంగారాం ఎక్స్ రోడ్డు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇసుకాసుర అవతారమెత్తి సొమ్ము చేసుకున్నట్లుగా జోరుగా ప్రచారం జరుగుతుంది.ఈ క్రమంలోనే శంకరాంపల్లి, గంగారాం, ధర్మసాగర్,గ్రామాల శివారులో పరిధిలో ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. అయితే విలాసాగర్ వ్యవహారాన్ని ఏ మాత్రం సీరియస్ గా తీసుకోని సంబంధిత అధికార యంత్రాంగం ఉదాసీనతగా వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



## జీరో దందాలో జేసీబీలదే కీలక పాత్ర

విలాసాగర్ కేంద్రంగా నడుస్తున్న ఇసుక లారీల జీరో దందాలో స్థానిక జేసీబీలదే కీలక పాత్ర వహించినట్లు తెలుస్తోంది. విలాసాగర్ సమీప గ్రామాలకు చెందిన జేసీబీ ఓనర్లు, ఇసుక స్మగ్లర్లు పరస్పర భాగస్వామ్యంతో గత కొన్ని నెలలుగా జీరో దందాను సాగించినట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది. రాత్రికి రాత్రే డంపుల్లోని ఇసుకని జేసీబీ లతో లారీల్లో లోడ్ చేయించి వరంగల్ మార్కెట్ కు తరలించినట్లుగా చర్చ జరుగుతుంది.కాగా ఇటీవల గంగారాం ఎక్స్ రోడ్డు వద్ద జీరో ఇసుక లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లుగా సమాచారం.అలాగే శంకరాంపల్లి గ్రామానికి చెందిన ఓ జేసీబీ ఓనర్ సైతం ఈ దందాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాడనే వార్త సంచారంలో ఉంది.అయితే గత కొన్నాళ్ళుగా ఈ తతంగం జరుగుతున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# పథకం ప్రకారమే హత్య



- బుగులోని గుట్ట కేసులో ఆరుగురి అరెస్ట్
- రవి రెండో భార్య, ఆమె కుమారుడితో పాటు మరో నలుగురు నిందితులు

అక్షర దర్బార్, రేగొండ: బుగులోని గుట్టల్లో హత్యకు గురైన భూపాలపల్లి మండలం కొంపెల్లికి చెందిన పరుష రవి (43) కేసును పోలీసులు ఛేదించి, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం రేగొండ పోలీస్ స్టేషన్‌లో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు వివరాలు వెల్లడించారు. ఈ కేసులో రవి రెండో భార్య రేణుక, ఆమె మొదటి భర్త కుమారుడు పాతపల్లి శ్రీకర్, కొంపెల్లి గ్రామస్థుడు శ్రీపాల్ హత్యకు సుపారీ ఇచ్చి మర్డర్ చేశారని డీఎస్పీ తెలిపారు. పినతండ్రి రవి తన తల్లి రేణుకను అనుమానంతో వేధిస్తుండటంతో శ్రీకర్ ఈ హత్యకు పథకం వేశాడని, తల్లి రేణుక, శ్రీపాల్ మద్దతుతో దీనిని అమలు చేశారన్నారు. దమ్మన్నపేట వాసి ఉదయ్ చందర్‌తో రూ.1,50,000కు డీల్ కుదుర్చుకుని, అతడి బంధువులైన పసుల సందీప్, ములుగురి నరేష్‌లతో కలిసి హత్య చేశారని పేర్కొన్నారు. ఈ నెల 9న నిందితులు కారు అద్దెకు తీసుకుని, హత్య స్థలాన్ని (రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులోని బుగులోని వెంకటేశ్వర స్వామి గుట్టలు) రెక్కీ నిర్వహించారు. 10వ తేదీన రవిని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, వైన్ షాప్ వద్ద మద్యం తాగించారు. అనంతరం రాత్రి ఒంటి గంట సమయంలో గుట్టల వద్దకు వచ్చి తాడుతో ఉరి బిగించి చంపి, మృతదేహాన్ని పొదల్లో పడవేసి పరారయ్యారు. రవి మొదటి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టగా, నిందితులను కారులో వెళ్తుండగా చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వారి నుండి స్మార్ట్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కారు, తాడును స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, రేగొండ ఎస్సై సందీప్‌లను డీఎస్పీ సంపత్ రావు అభినందించారు.



## బీసీలపై మాట్లాడే నైతిక విలువ బీఆర్ఎస్‌కు లేదు

అక్షర దర్బార్, పరకాల: బీసీలపై మాట్లాడే నైతిక విలువ బీఆర్ఎస్ నాయకులకు లేదని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ బీసీలకు ఏం చేసిందో చెప్పిన తర్వాతే బీసీ వర్గంపై మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లతో పాటు, ప్రభుత్వంలో న్యాయబద్ధమైన పదవులను అందిస్తుందని, ఇది బీఆర్ఎస్‌కు మింగుడు పడటం లేదని విమర్శించారు. బీసీలపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో బీసీలు ఇచ్చిన తీర్పు సరిపోలేదా అని ప్రశ్నించిన దేవేందర్ గౌడ్, టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే తెలంగాణలోని బీసీల పట్ల మాట్లాడే హక్కును కోల్పోయారని దుయ్యబట్టారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### డీఎంహెచ్ఓ డా. అప్పయ్య
### రాయపర్తి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ
### సిబ్బందికి పలు సూచనలు

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ డా. అప్పయ్య బుధవారం రాయపర్తి పీహెచ్‌సీ పరిధిలోని నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక కార్యక్రమాలు, రికార్డులను పరిశీలించారు. నార్లాపూర్ సబ్ సెంటర్‌లో విద్యుత్తు సౌకర్యం లేదని సిబ్బంది దృష్టికి తీసుకురాగా, త్వరలోనే పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీలలో ప్రతి బుధవారం జరిగే సిబ్బంది సమావేశంలో పాల్గొన్న ఆయన, సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. కొక్కొండ దివ్య, పల్లె దావఖానా డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం

### గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు

అక్షర దర్బార్, శాయంపేట: గత సంవత్సరము 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మండల విద్యాధికారి బిక్షపతి చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించడం మొదటి అడుగు మాత్రమేనని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ చేసిన ఈ కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆత్మవిమర్శ చేసుకోవాలి

- ప్రభుత్వ అభివృద్ధిని ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు
- భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య



అక్షర దర్బార్, రేగొండ: బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య అన్నారు. బుధవారం రేగొండలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పైన, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై చేసిన ఆరోపణలన్ని అసత్యాలేనని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా కృషి చేస్తుందని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని ఆయన విమర్శించారు. ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పిన మీకు జ్ఞానం రాలేదా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుణ్ణం రవి, సుదరబోయిన ఓం ప్రకాష్, పట్టెమ్ శంకర్, పొనుగంటి వీరబ్రహ్మం, గండి తిరుపతి, తోకల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం కీలకం

అక్షర దర్బార్, శాయంపేట: మొక్కలు నాటడం విద్యార్థి జీవితంలో అలవర్చుకోవాలని సన్‌రైజ్ పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి సూచించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, సాయి రెడ్డి, రాజకుమార్, జ్యోతి, సోనీ, స్వప్న, రుద్రా శ్రీతో పాటు విద్యార్థులు దీక్ష సింగ్, సాన్విక, వర్షిత్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

